

వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# రక్షణ కల్పించేందుకే బోట్ శిక్షణ

**నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి**



శిక్షణ ఇస్తున్న సిబ్బంది

నిర్మల్ అర్బన్, జూలై 12 : వరద నీటిలో చిక్కుకున్న బాధితులను సురక్షితంగా రక్షించేందుకు రెస్క్యూ టీం సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ వినాయక్‌సాగర్‌లో పోలీసులకు ఏయిర్ బోట్ శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలోని కడెం, గడ్డెన్న, స్వర్ణ వాగు ప్రాజెక్టుల్లో వరదల కారణంగా లోతట్టు ప్రాం తాల్లో చిక్కుకున్న వారిని విపత్తుల సమయంలో సురక్షితంగా కాపాడేందుకు శిక్షణ దోహదం చేస్తుందన్నారు. వరదల సమయంలో నీటిలో చిక్కుకున్న వారిని రెస్క్యూ బోట్, లైవ్ జాకెట్‌ల ద్వారా ఎలా కాపాడవచ్చని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా దశలవారీగా పోలీసులకు శిక్షణను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఏఆర్ ఎస్సై రవి నాయక్, దేవేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# మొక్కలు నాటి రక్షించాలి

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

సోన్, జూలై 12 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం సోన్ మండలంలోని సాకెర గ్రామ శివాలయ ప్రాంగణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పచ్చదనం పెంపొందించడానికి వనమహోత్సవ కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 5 లక్షలకు పైగా మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. అడవులను సంరక్షించడం, పర్యావరణ పరిరక్షణ కోసం అధిక సంఖ్యలో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం జాఫ్రాపూర్ గ్రామ రైతు పొలంలో వ్యవసాయశాఖ అధికారులు నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. సాగు విస్తీర్ణం, పంటల నమోదు, దిగుబడి విషయాలను అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు చేస్తున్న సాగు, విస్తీర్ణాన్ని నమోదు చేయాలని సూచించారు. సాగులో సందేహాలను నివృత్తి చేసి అధిక దిగుబడులు సాధించేలా రైతులకు సలహాలు, సూచనలు అందించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, తహసీల్దార్ మల్లేశ్ పాల్గొన్నారు.

### అవగాహన కల్పించండి..

నిర్మల్ అర్బన్, జూలై 12 : కడెం మండలంలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాల ప్రజల పునరావాసానికి కొత్త మద్దిపడగ గ్రామంలోని వ్యవసాయం కోసం ఇవ్వబడిన భూమిని సాగు అయ్యేలా చూడాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయ, అటవీ శాఖల అధికారులతో సౌకర్యాలపై సమీక్షించారు. పునరావాస ప్రజలకు వ్యవసాయం చేసుకునేందుకు 262 ఎకరాలు కేటాయించామని తెలిపారు. ప్రతి ఎకరం సాగు అయ్యేలా గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీపీవో అంజీ ప్రసాద్, ఆర్డీవో రత్న కల్యాణి పాల్గొన్నారు.

# గృహజ్యోతి తిప్పలు

## పనిచేయని సర్వర్.. జనం ఇబ్బందులు..





ఆదిలాబాద్ మున్సిపాలిటీ ప్రజాపాలన సహాయ కేంద్రం వద్ద దరఖాస్తుదారులు

ఆదిలాబాద్, జూలై 12(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పథకం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా జనం జీరో బిల్లులకు నోచుకోవడం లేదు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న పేదలు 200 యూనిట్లలోపు కరెంటు వినియోగిస్తే జీరో బిల్లు వచ్చేలా ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నది. ప్రజాపాలనలో భాగంగా అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అధికారులు, సిబ్బంది తప్పిదాల కారణంగా అర్హులు ఈ పథకానికి దూరమవుతున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డులకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు విద్యార్థులతో ఓ ప్రైవేటు కళాశాలలో వివరాలను నమోదు చేయించారు. వారు గృహజ్యోతి దరఖాస్తుదారుల మీటర్ల నంబర్లు, యూఎస్ఈ నంబర్లు, దరఖాస్తు చేసిన చేయనట్లు ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. తప్పుల సవరణ కోసం అధికారులు మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన సహాయ కేంద్రాలు ప్రారంభించిన ఎడిట్ ఆప్షన్ సౌకర్యం లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకున్నది. దీంతో 200 యూనిట్లలోపు కరెంటు వాడుతున్న పేదలు కూడా బిల్లులు చెల్లించాల్సి వస్తున్నది.

### వేల రూపాయల బిల్లులు

గృహజ్యోతి పథకానికి అర్హులుగా ఉన్న తమకు జీరో బిల్లులు వస్తాయని విద్యుత్ వినియోగదారులు నాలుగు నెలలుగా ఎదురుచూశారు. వివరాలను సరిచేయడానికి అవకాశం లేకపోవడంతో నాలుగు నెలల బిల్లులు వేల రూపాయలకు చేరాయి. దీంతో విద్యుత్ కనెక్షన్ తొలగిస్తారనే భయంతో ప్రజలు భారీగా బిల్లులు చెల్లించారు. ఇదే అవకాశంగా భావించిన విద్యుత్ శాఖ బకాయిల ఫైన్ రూపంలో ఒక్కొక్కరికి రూ.75 వసూలు చేశారు. ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించే అవకాశం నిలిచిపోవడంతో విద్యుత్ సబ్‌స్టేషన్లలోని కౌంటర్‌లలో జరిమానాతోపాటు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వచ్చింది.

### పనిచేయని సర్వర్

ఐదు నెలలుగా ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో తమ వివరాలను సరిచేసుకునే అవకాశం వినియోగదారులకు లభించడం లేదు. రెండ్రోజుల కిందట గృహజ్యోతి సవరణలో భాగంగా దరఖాస్తు సమయంలో విద్యుత్ మీటర్ యూనిఫైడ్ సర్వీస్ కోడ్, సర్వీస్ నంబరు తప్పుగా నమోదైన వాటిని సవరణకు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఎన్నో రోజులు తర్వాత తప్పుల సవరణకు అవకాశం లభించడంతో ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని 49 వార్డులకు చెందిన ప్రజలు బల్దియా ప్రజాపాలన సహాయ కేంద్రానికి వచ్చారు. అక్కడ కౌంటర్‌లో సంప్రదించగా సర్వర్ పనిచేయడం లేదని సిబ్బంది సమాధానం ఇచ్చారు. దీంతో జనం చేసేదేమీ లేక నిరాశతో వెనుతిరిగారు.



రిబ్బన్ కట్ చేసి షెడ్డును ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# దేవాలయాల అభివృద్ధికి కృషి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

తలమడుగు, జూలై 12 : కుల, మతాలకు అతీతంగా అన్ని దేవస్థానాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారీ బంగ్లా షెడ్డును ప్రారంభించారు. గ్రామస్తుల కోరిక మేరకు తక్షణమే స్పందించి షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ ఐక్యంగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ ఎల్మా శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, యువ నాయకులు అభిరాం రెడ్డి, జనాక్ పటేల్, అబ్దుల్లా, రమాకాంత్, ప్రమోద్, గంగాధర్, సుదర్శన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, రాంబాయి, పల్లవి, లక్ష్మణ్, నర్సింహులు, రాంరెడ్డి, నారాయణ రెడ్డి, ప్రీతంరెడ్డి, కృష్ణారెడ్డి, తిరుమల్ గౌడ్, పాండురంగ్, రమేశ్, విజయ్ పాల్గొన్నారు.

# నీటిని నిల్వ ఉంచొద్దు..

## దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలుతాయి

- వారంలో రెండు రోజులు డ్రై డే నిర్వహించాలి..
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి..
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



మురికికాలువలో దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూలై 12 : వర్షకాలంలో దోమల వల్ల అనేక వ్యాధులు ప్రబలుతాయని, నీటి నిల్వ కారణంగా దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మివాడ, చిల్కూరి లక్ష్మినగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ హాజరై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందించారు. ఓ ఇంటిలోని కూలర్‌లో నీటి నిల్వ కారణంగా దోమల లార్వ ఉండడాన్ని గమనించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి కాలువల్లో బ్లీచింగ్, స్ప్రేతోపాటు నీటి నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయించారు. కాలనీకి వచ్చిన కలెక్టర్ తొలుత మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, వార్డు కౌన్సిలర్ సంద నర్సింగ్, వైద్యసిబ్బంది రఘునాథ్, అనిల్ పాల్గొన్నారు.

### నిర్మాణ పనుల తీరుపై సమీక్ష

తాంసి(ఎదులాపురం), జూలై 12 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనుల తీరు, వర్షాలకు రహదారులు కోతకు గురైన వాటి వివరాలు, నిర్మాణ పనుల తీరుపై శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ రాజర్షి షా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం రహదారుల నిర్మాణం, కటాఫ్ రోడ్లపై సమీక్షించి ఆర్అండ్‌బీ అధికారి నర్సయ్యను చేపడుతున్న రోడ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్ నుంచి కెరమెరి, హస్నాపూర్ నుంచి ఎల్లాపూర్, రాంపూర్ నుంచి నిపాని ఎక్స్ రోడ్డు పనులపై సమీక్షించారు. రోడ్డు డ్యామేజీ అయినా వివిధ మండలాల పరిధిలోని లో లెవెల్ బ్రిడ్జి, అంశాలపై సమీక్షించి త్వరగా పనులు పూర్తి చేయాలని, నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

# అభియాన్ పథకాన్ని సకాలంలో పూర్తి చేస్తాం

**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా**

ఉట్నూర్, జూలై 12 : ప్రధానమంత్రి జన జాతీయ న్యాయ మహా అభియాన్ పథకాన్ని సకాలంలో పూర్తి చేస్తామని పీవీటీజీ సంఘాల నాయకులకు ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా తెలిపారు. స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో పీవీటీజీ సంఘ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్టాఫ్ నర్సులను నియమించామని తెలిపాఉ. విద్యుత్ కోసం సోలార్‌ను ఏర్పాటు చేశామన్నారు. నీటి సౌకర్యం లేని జైనూర్, నార్నూర్ మండలాల్లోని పీవీటీజీ గ్రామాలను గుర్తించి వాటర్ ట్యాంకర్ అందించామన్నారు. మునగ మొక్కలను సాగు చేయడం వల్ల గర్భిణులకు మేలు జరుగుతుందన్నారు. పెంచికల్‌పేట్‌లో కొబ్బరి సాగు శిక్షణ పరిశ్రమను ఏర్పాటు చేశామన్నారు. ఆయిల్ పాం, తేనె టీగల పెంపకం, కోళ్ల ఫాం పెంపకం చేసి ఆదిమ గిరిజన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్, పీవీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఇండియన్ ఏయిర్ ఫోర్స్ అధికారి అనిల్ గోస్వామి, జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ అనిత

# ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

- అక్టోబర్ 18వ పరీక్ష
- ఇండియన్ ఏయిర్ ఫోర్స్ అధికారి అనిల్ గోస్వామి

ఎదులాపురం, జూలై 12 : అర్హత, ఆసక్తి గల యువతీయువకులు ఇండియన్ ఏయిర్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్ కొరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇండియన్ ఏయిర్ ఫోర్స్ అధికారి అనిల్ గోస్వామి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ రాజర్షి షా సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ స్టడీ స్కూల్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామర్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీల్లో అవగాహన కల్పించారు. ముందుగా ఏయిర్ ఫోర్స్‌కు సంబంధించిన కరపత్రాలను అధికారులు, విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియన్ ఏయిర్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్ కొరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 8 నుంచి 28వ తేదీ వరకు ఉంటుందన్నారు. అక్టోబర్ 18, 2024న పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://agnipathvayu.cdac.in/కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీపీఆర్వో తిరుమల పాల్గొన్నారు.

# క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలి

**ఆదిలాబాద్ జిల్లా విద్యాధికారి ప్రణీత**

ఎదులాపురం, జూలై 12 : జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో ప్రణీత అన్నారు. శుక్రవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్‌జీఎఫ్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈవిద్యా సంవత్సరంలో జరిగే క్రీడా పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపే విధంగా పీఈటీలు కృషి చేయాలన్నారు. వారికి కావాల్సిన సహకారాన్ని శాఖ తరపున పూర్తిగా అందిస్తామన్నారు. అంతకు ముందు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతరావు క్రీడా క్యాలెండర్‌ను విడుదల చేశారు. అనంతరం ఇటీవల పీడీలుగా పదోన్నతులు పొందిన వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, పేటా టీఎస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దయనంద్‌రెడ్డి, జక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రిమ్స్ తనిఖీ

- మందుల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలి
- మూడు రోజుల్లోగా సదరం సర్టిఫికెట్ అందించాలి
- కలెక్టర్ రాజర్షి షా



సదరం సర్టిఫికెట్ కోసం వచ్చిన వారికి చేస్తున్న వైద్యసేవల తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూలై 12 : రిమ్స్ ఆసుపత్రిని కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ముందుగా రిమ్స్ పాత భవనంలోని ఓపీ కౌంటర్ పరిశీలించారు. ఓపీ కౌంటర్ వద్ద ఆన్‌లైన్ తీరును పరిశీలించి సూచనలు చేశారు. ఈ క్రమంలో క్యూలైన్‌లో ఉన్న మహిళా తన కుమారుడు రాజ్ పంగే పవన్‌కు సదరం సర్టిపికేట్ ఉన్నా ఆసరా ఫించన్ రావడంలేదని కలెక్టర్‌కు తెలిపారు. అప్పటికప్పుడు సదరం సర్టిఫికెట్‌ను పరిశీలించి సమస్యను పరిష్కరించి పించన్ వచ్చేలా చూడాలని డీఆర్‌డీఏ, ఫించన్ సెక్షన్‌కు సంబంధించిన సిబ్బందికి సూచించారు. సదరం కోసం వచ్చిన వారికి ఇబ్బందులు లేకుండా, మూడు రోజుల్లో సదరం సర్టిఫికెట్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రిమ్స్‌లో రికార్డులు సక్రమంగా లేకపోవడం, అవసరం మేరకు మందుల సరఫరా ఉండకపోవడాన్ని ప్రశ్నిస్తూ, అక్కడి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఈ నెల 5వ తేదీ నుండి మందులకు సంబంధించిన రికార్డులు రాయకపోవడం సిబ్బందిని నిలదీశారు. మందుల నిల్వ చేసిన స్టోర్‌రూమ్ మరమ్మతు కోసం రూ.5 లక్షలు కేటాయించామని, వెంటనే మరమ్మతులు చేసుకోవాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సూచించారు. అనంతరం వనమహోత్సంలో భాగంగా కలెక్టర్ మొక్కలు నాటి నీరుపోశారు. కలెక్టర్ వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, సూపర్‌స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఇద్రీస్ అక్బానీ, డీఆర్‌డీఏ సాయన్న, ఆర్ఎంలు తొడసం చందు, చంపత్‌రావు, వైద్యులు శిరీష్, సత్యనారాయణ ఉన్నారు.

### త్వరలోనే మహిళా శక్తి క్యాండ్ ప్రారంభం

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళ సంఘాలతో నిర్వహిస్తున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని కలెక్టర్ అన్నారు. శుక్రవారం సూపర్ స్పెషాలిటీలో కలెక్టర్ మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాట్లను పరిశీలించారు. మహిళా సంఘాలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల పర్యాటన ఉండడంతో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏర్పాట్లులో ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామని పేర్కొన్నారు.

# ఏ పనికైనా వాగు దాటాల్సిందే..



ఎడ్లబండితో చిత్తబట్ట వాగు దాటుతున్న గౌరాపూర్ గ్రామానికి చెందిన రైతు

*ఇంద్రవెల్లి మండలంలోని ఆ రెండు గ్రామాలకు చెందిన ప్రజలు ఏ పనులకైనా వెళ్లాలంటే వాగు దాటాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. శుక్రవారం మండలంలోని గౌరాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ పనిముట్లు ఎడ్లబండిలో పెట్టుకుని వాగును దాటి వ్యవసాయానికి వెళ్లాడు. గౌరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిత్తబట్ట గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు వైద్యంతోపాటు నిత్యావసర సరుకులతోపాటు వాగును దాటి రావల్సిందే. అంతేకాకుండా గౌరాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు వ్యవసాయ పనుల కోసం తప్పక వాగును దాటి వెళ్తేనే వ్యవసాయ పనులు చేయడం జరుగుతుందని పలువురు రైతులు తెలిపారు.*

*- ఇంద్రవెల్లి, జూలై 12*